సాక్షి సూర్యాపేట

గురువారం । 24 । అక్టోబర్ । 2024



ఆస్తి కోసమే చంపించాడు

ఆస్తి కోసం అన్నను చంపించాడు ఓ తమ్ముడు. ఈ కేసు వివరాలను మిర్యాల గూడ డీఎస్పీ వెల్లడించారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.50 అడుగులు
ఇన్‌ఫ్లో	: 48,569 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 48,569 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,476 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,20 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,005 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,454 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

25న రక్తదాన శిబిరం



ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 25వ తేదీన జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఆరోగ్యవంతమైన యువత, ప్రజలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. మీరు చేసే రక్తదానం అత్యవసర సమయాల్లో ఇతరులకు ప్రాణదానం అవుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేసే వారు శుక్రవారం ఉదయం ఉదయం 9 గంటల వరక పోలీస్ కార్యాలయానికి రావాలని కోరారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా శ్రీవాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీవాణి

చివ్వెంల: సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించారు. సూర్యాపేట జిల్లా కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణపిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, న్యాయవాదులు కోక రంజిత్ కుమార్, కట్ట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల నిర్ణయంపై 28 నుంచి విచారణ

భానుపురి (సూర్యాపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ణయానికి సంబంధించి అభ్యర్థనలు, సూచనలు, అభ్యంతరాలు వినడానికి ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా కేంద్రాల వారీగా బహిరంగ విచారణలు నిర్వహించనున్నట్లు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. బుధవారం బీసీ కమిషన్ సభ్యులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించి బహిరంగ విచారణ కోసం కమిషన్ జిల్లాల పర్యటనలపై పలు సూచనలు చేశారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డీఎంఎల్‌టీ, డీఏట రెండు సంవత్సరాల పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, ఎంపీసీ, ఇతర కోర్సుల విద్యార్థుల దరఖాస్తులు కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు రూ.100 చెల్లించి మెడికల్ కాలేజీ పొందాలని తెలిపారు. ఈ దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ లోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి

చిలుకూరు: మహిళా బిల్లును వెంటనే అమలు చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. బుధవారం చిలుకూరులోని సీపీఐ భవన్‌లో జరిగిన మహిళా సమాఖ్య జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక షీటీమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చేనెలలో జరిగే జాతీయ మహిళా సమాఖ్య, రాష్ట్ర మహిళా సమాఖ్య మహాసభలకు మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, నాయకురాళ్లు లక్ష్మి, అలివేలు, రెమిడాల జయసుధ, షేక్ మహముదా బేగం, పార్వతి, ఉమ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ ఎస్‌ఐ.. వీఆర్‌కు అటాచ్

పెన్‌పహాడ్: ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన పెన్‌పహాడ్ ఎస్‌ఐ రవీందర్‌ను ఎస్పీ కార్యాలయానికి (వీఆర్‌కు) అటాచ్ చేశారు. విధి నిర్వహణలో విఫలమయ్యే పోలీస్ అధికారులపై చర్యలు చేపడతామని ఈ నెల 4న మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ హెచ్చరించిన నేపథ్యంలో బుధవారం ఎస్‌ఐను వీఆర్‌కు అటాచ్ చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా హెడ్‌కానిస్టేబుల్ ఆంగోతు యాదగిరి బాధ్యతలు చేపట్టారు.

ఆడిట్ హడల్!

పంచాయతీల్లో గతంలో చేపట్టిన పనుల లెక్కలు తీస్తున్న అధికారులు

- మొన్న నల్లగొండ జిల్లాలో.. ఇప్పుడు సూర్యాపేటలో
- ఎప్పుడో చేసిన పనులపై ఇప్పుడు ఆడిట్
- ఆందోళన చెందుతున్న పంచాయతీ కార్యదర్శులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అధికారుల తీరుతో పంచాయతీ కార్యదర్శులు హడలెత్తుతున్నారు. సర్పంచ్‌ల కాలపరిమితి పూర్తి కావడంతో పంచాయతీల పాలన భారమంతా కార్యదర్శులపైనే పడింది. చిన్నపనికి కూడా సొంతంగా డబ్బు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో గ్రామాల్లో రెండు మూడేళ్ల కిందట చేసిన పనులపై ఆడిట్ చేపట్టడంతో పంచాయతీ కార్యదర్శులు హడలెత్తిపోతున్నారు. మొన్నటి వరకు నల్లగొండ జిల్లాలో ఆడిట్ చేపట్టగా.. కార్యదర్శుల విజ్ఞప్తితో నిలిచిపోయింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలో ఆడిట్ ప్రక్రియ చేపడంతో కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. ఆడిట్‌ను ఉపసంహరించుకోలని కోరుతున్నారు.

సర్పంచ్‌లు చేసిన పనులకు..

గ్రామ పంచాయతీ పాలకవర్గాలున్న సమయంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పలు కార్యక్రమాలను చేపట్టింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీ, రోడ్ల వెంట, వీధుల్లో మొక్కలు నాటడం, శానిటేషన్, సెగ్రిగేషన్ షెడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఆ పనులన్నీ అప్పట్లో సర్పంచ్‌లే చేయించారు. అయితే వారి కాలపరిమితి ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. ప్రస్తుతం ఆ పనులపై జిల్లా యంత్రాంగం ఆడిట్ చేపట్టింది. ఎప్పుడో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు ఇప్పుడు ఆడిట్ చేసి కార్యదర్శులను బాధ్యులను చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలో కొనసాగుతున్న ఆడిట్

గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సూర్యాపేట జిల్లా యంత్రాంగం తాజాగా ఆడిట్ చేపట్టింది. అప్పట్లో పనిచేసిన కార్యదర్శులంతా కలెక్టరేట్‌కు ఫైళ్లను పట్టుకొని వచ్చి సమాధానాలు చెప్పాల్సి ఉంది. గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి జీఎస్టీ కట్ చేసి, ఏతఃచేసిన బిల్లుల ఆధారంగా గ్రామ పంచాయతీలు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాయి. స్టేట్ జీఎస్టీ, సెంట్రల్ జీఎస్టీ డబ్బు గ్రామ పంచాయతీల అకౌంట్లలోనే ఉండిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి జీఎస్టీ కింద 18 శాతం కట్ చేసిన డబ్బును ఆయా కార్యాలయాల్లో చెల్లించాలి. సూర్యాపేట జిల్లాలో జీఎస్టీ కింద కట్ చేసిన డబ్బును ఎందుకు జీఎస్‌జీ శాఖలకు జమ చేయలేదంటూ అప్పుడు పని చేసిన కార్యదర్శులను పిలిపించి ప్రశ్నిస్తున్నారు. దానిపై జిల్లా ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు రాలేదని.. పైగా ఎలా చెల్లించాలనే ప్రాసెస్ కూడా తమకు తెలియదని కార్యదర్శులు వాపోతున్నారు. జీఎస్టీ చెల్లించలేదని, ఆ డబ్బు పంచాయతీల అకౌంట్లలో ఉండిపోయిందని చెబుతున్నారు. కార్యదర్శులు కొందరు బదిలీపై వెళ్లారు. ఇప్పుడు వారిని పిలిచి ప్రశ్నల వర్షం కురిపిస్తుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆడిట్ నిలివేయాలని కోరుతున్నారు.

నల్లగొండ జిల్లాలో తాత్కాలికంగా నిలిపివేత..

పంచాయతీల్లో ఓటర్ల జాబితాను బీఎల్‌వోలు కాకుండా పంచాయతీ కార్యదర్శులే తయారు చేయాలని రెండు నెలల కిందట నల్లగొండ జిల్లాలో అధికారులు కొందరు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. అందుకు కార్యదర్శులు నిరాకరించారు. దీంతో పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై జిల్లా యంత్రాంగం ఆడిట్‌కు ఆదేశించింది. దీనిపై కార్యదర్శులంతా కలెక్టర్‌కు విన్నవించుకోవడంతో ఆడిట్ ప్రక్రియ నల్లగొండ జిల్లాలో తాత్కాలికంగా ఆగిపోయింది.

జిల్లాలో నేడు గవర్నర్ పర్యటన



గవర్నర్ రాక సందర్భంగా పూలతో అలంకరించిన సూర్యాపేట కలెక్టరేట్ ద్వారం

- సూర్యాపేట కలెక్టరేట్‌ను సందర్శించనున్న జిష్ణుదేవ్ వర్మ
- ఉదయం అధికారులతో సమీక్ష
- మధ్యాహ్నం కవులు, వివిధ అవార్డు గ్రహీతలతో సమావేశం



భానుపురి (సూర్యాపేట): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సూర్యాపేట జిల్లాకు రానున్నారు. మూడ్రోజుల జిల్లాల పర్యటనలో భాగంగా మొదటి రోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి సూర్యాపేటకు చేరుకోనున్నారు. సూర్యాపేట జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాలో మొదటిసారి గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఇప్పటికే ఆదేశించారు. కాగా గవర్నర్ మధ్యాహ్నం 2గంటల వరకు మధ్యాహ్న భోజనం చేసి భద్రాచలం బయలుదేరనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం : కలెక్టర్

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. బుధవారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో జిల్లా అధికారులతో రాష్ట్ర గవర్నర్ పర్యటనపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 10గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలతో ముఖాముఖీ కార్యక్రమం ఉంటుందన్నారు. కలెక్టరేట్ కార్యాలయాన్ని సుందరంగా ముస్తాబు చేయాలని, జిల్లాలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఛాయా చిత్ర ప్రదర్శన, డీఆర్‌డీఏ, డీడబ్ల్యూఓ, డీఎంహెచ్‌ఓ, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశు సంవర్ధక శాఖ స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్‌లు, డీఆర్‌డీఏ పీడీ అప్పారావు, డీఈఓ అశోక్, డీపీఓ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, అగ్రికల్చర్ అధికారి శ్రీధర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగయ్య, పశు సంవర్ధక అధికారి శ్రీనివాస్, డీటీడీఓ శంకర్, బీసీ వెల్ఫేర్ అధికారి అనసూయ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి లత, పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా..

- ఉదయం 10:30 గంటలకు సూర్యాపేట కలెక్టరేట్‌కు రాక
- 10:35 గంటలకు గవర్నర్‌కు గార్డ్ ఆఫ్ హానర్
- ఉదయం 10:35 నుంచి 10:40 వరకు స్టాల్స్ సందర్శన
- ఉదయం 10:40 నుంచి 10:45 వరకు కలెక్టరేట్ మీటింగ్ హాల్‌కు ప్రముఖుల రాక
- ఉదయం 10:45 నుంచి 10:50 వరకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ స్వాగత ప్రసంగం
- 10:50 నుంచి 11:10 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు
- 11:10 నుంచి 11:25 వరకు పీపీటీ ద్వారా జిల్లా సంక్షిప్త పరిచయం
- 11:25 నుంచి 11:50 వరకు జిల్లా అధికారులతో గవర్నర్ పరిచయ కార్యక్రమం
- 11:50 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర అవార్డు గ్రహీతలు, ప్రముఖ వ్యక్తులతో గవర్నర్ ముఖాముఖి
- మధ్యాహ్నం 12:25 నుంచి 12:40 వరకు గవర్నర్ ప్రసంగం
- మధ్యాహ్నం 12:40 నుంచి 01:00 గంట వరకు గవర్నర్‌కు సన్మాన కార్యక్రమం
- మధ్యాహ్నం 1:00 నుంచి 2:00 వరకు లంచ్

డ్రైపోర్టు పేరు చెప్పి సిమెంట్ కంపెనీ పెడతారా?

- పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకునే వరకు పోరాడుతాం
- ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టం చేసిన నాయకులు



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న ప్రజలు

రామన్నపేట: అదానీ సంస్థ యాజమాన్యం డ్రైపోర్టు పేరు చెప్పి ఇప్పుడు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు చేయడం ఆక్షేపణీయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పేర్కొన్నారు. రామన్నపేట శివారులో అంబుజా సిమెంట్ పరిశ్రమ స్థాపనపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. నిబంధనలను తుంగలో తొక్కి ప్రజల కంఠంపై కంపనీలు పెడతామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సిమెంట్ పరిశ్రమల కాలుష్యం వల్ల దామరచర్ల, నేరేడుచర్ల ప్రాంతాల ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే వ్యవసాయంతోపాటు చేతివృత్తులు దెబ్బతినే ప్రమాదం ఉంటుందన్నారు. కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకునే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కంపెనీ ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వద్దని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణలో వివిధ పార్టీల నాయకులు మాట్లాడి కంపెనీ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు.

రామన్నపేట అనువైన ప్రాంతం కాదు



సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు రామన్నపేట అనువైన ప్రాంతం కాదు. కంపెనీ ప్రతిపాదిత స్థలానికి అర కిలోమీటరు దూరంలో పద్మశాలీ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, రైల్వే కాలనీ ఉన్నాయి. కూతవేటు దూరంలో రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం గ్రామాలు ఉన్నాయి. కంపెనీ ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలు కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉంది.

–ఎండీ జహంగీర్, సీపీఎం జిల్లాకార్యదర్శి

వ్యవసాయం దెబ్బతింటుంది



రామన్నపేట ప్రాంతంలో 90 శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేస్తే వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. రైతులకు సాగునీటి వనరుగా ఉన్న ధర్మారెడ్డిపల్లి కాలువలో మూసీ జలాలు విషతుల్యం కానుంది. పంటచేలు దెబ్బతింటాయి.

–మేక అశోక్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

కబ్జా భూముల పరిశీలన

కోదాడ: కోదాడ పట్టణ శివారులోని తమ్మరబండపాలెం వద్ద ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను బుధవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇక్కడ ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయంలో రెవెన్యూ అధికారులు ఉదాసీనవైఖరి 'సాక్షి' బుధవారం 'ఫైల్‌ను బుట్టదాఖలు చేశారా' శీర్షికన ప్రచురించిన ప్రత్యేకంతో రెవెన్యూ అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ భూమి విషయంపై తనకు సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో కోదాడ రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది తమ్మరబండపాలెం వద్ద ఉన్న సర్వే నంబర్ 39 భూములను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. గతంలో అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి నివేదికను రూపొందించిన తరువాత మళ్లీ సర్వే చేస్తామని అధికారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సాక్షి ఎఫెక్ట్..



సర్వే నంబర్ 39 వద్ద భూములను పరిశీలిస్తున్న అధికారులు

వికలాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

మునగాల: ఎన్నికల సమయంలో వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వడంతోపాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం మునగాల మండలం బరాఖత్‌గూడెంలో ఏర్పాటు చేసిన ఆ సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీచేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి నేటి వరకు చేయలేదన్నారు. ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25, 26, 27 తేదీల్లో నల్లగొండలో నిర్వహించే సమితి రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి మునగాల మండల శాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి మధన్‌మోహన్‌రెడ్డి, బీసీ, మైనార్టీ, ఎస్టీ సెల్ విభాగాల నాయకులు చల్లా బ్రహ్మం, షేక్ ఖాసీం, సుజాత పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలతో ప్రజాస్వామ్యం ఖూనీ



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

నేరేడుచర్ల: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చే జమిలీ ఎన్నికలతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నేరేడుచర్ల మండలం ముకుందాపురంలో నిర్వహించిన ఆ పార్టీ మండల మహాసభలో మాట్లాడారు. జమిలీ ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానాన్ని కోరుకునే ప్రతీ పార్టీ జమిలీ ఎన్నికలను ముక్త కంఠంతో బహిష్కరించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు మద్దతు పలుకుతూ సామాన్య ప్రజలపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పారేపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు, కొదమ గండ్ల నగేష్, బ్రహ్మం, శ్రీను, నాగేశ్వరరావు, సైదులు, శ్రీధర్, జానకిరాములు, ధనుంజయ, మధు, అప్పారావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి



గరిడేపల్లి : పొనుగోడు పాఠశాలలో ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ నేతలు

గరిడేపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్ కోరారు. బుధవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి, పొనుగోడు, గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలతోపాటు పాలకవీడు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కందుకూరి శివశంకర్, గోదేశి దయాకర్, కట్కూరి మధుసూదన్‌రెడ్డి, కందిమళ్ల సైదులు, శ్రీనివాస్, సువర్ణ, నరసకుమారి, నిమ్మల శ్రీనివాస్, కామల్ల పెంటయ్య, పులుసు వెంకటేశ్వరు నాగరాజు, మేకల సందీప్, మైనం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి హాంఫట్!

కోదాడ పరిధిలోని శ్రీరంగాపురం వద్ద 24 ఎకరాలు ఆక్రమణ

- 2017 సంవత్సరంలో 10 ఎకరాలు స్వాధీనం చేసుకున్న అధికారులు
- మళ్లీ కబ్జాకు గురైనా పట్టించుకోని వైనం
- ఇక్కడ ఎకరం రూ.రెండు కోట్ల పైమాటే..



సర్వే నంబర్ 635లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అప్పటి తహసీల్దార్ శ్రీదేవి (ఫైల్)

కోదాడ: కోదాడ పట్టణ సమీపంలో కోట్ల రూపాయల విలువైన 24 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి తెర వెనుక ఉండి అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ–దరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఈ భూములు ఉండడంతో ఇక్కడ ఎకరం రూ.2 కోట్ల పైమాటే ధర పలుకుతోంది. దీంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అసలు విషయం ఏమిటంటే..

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 635లో 31 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. 1990 నుంచి 2010 వరకు ఈ సర్వే నంబర్‌లో 7 ఎకరాల 8 గుంటల భూమిని ఆరుగురు పేదలకు అసైన్డ్ చేశారు. ఇది పోను అక్కడ 24 ఎకరాల 13 గుంటల భూమి మిగిలి ఉండాలి. కానీ, ప్రస్తుతం అక్కడ గుంట భూమికూడా లేకుండా ఆక్రమణకు గురైంది. దీనిపై పలువురు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రమంలో 2017లో కోదాడ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడింది. కోదాడకు నూతన ఆర్డీఓగా భిక్షూనాయక్ వచ్చారు. సర్వే నంబర్ 635లో ప్రభుత్వ భూమి విషయాన్ని కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ చేసి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని అప్పటి కోదాడ తహసీల్దార్‌ను ఆదేశించారు. దీనిపై విచారణ చేసిన తహసీల్దార్ శ్రీదేవి సర్వే నంబర్ 635లో 10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని అప్పటి వీఆర్‌ఏను ఆ భూమికి కాపాలా ఉంచారు. ఈలోగా అప్పటి అధికారులు బదిలీపై వెళ్లడంతో మళ్లీ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. తమకు కోర్టు ఆర్డర్ ఉందని చెపుతూ ఆ భూమిలోకి అధికారులు రాకుండా ఆక్రమణదారులే అడ్డుకుంటున్నారని సమాచారం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కోదాడ పట్టణ సమీపంలో శ్రీరంగాపురం వద్ద సర్వే నంబర్ 635లో ఉన్న ప్రభుత్వ భూమి విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమి ఆక్రమించుకొంటే క్రిమినల్ కేసులు పెడతాం.

– సీహెచ్.సూర్యనారాయణ, ఆర్డీఓ, కోదాడ

బై నంబర్లతో తప్పుడు రికార్డులు..

కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన వీఆర్‌ఓ ఒకరు ఈ ప్రభుత్వ భూమి ఆక్రమణలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ సర్వే నంబర్‌కు బై నంబర్‌లు వేసి పలువురి పేర్లను పహణీలలో చేర్చారు. వాస్తవానికి ప్రభుత్వ భూములకు బై నంబర్లు ఉండవు. ఐనా ఇక్కడ పదుల సంఖ్యలో బై నంబర్లు వేసినా అధికారులు పట్టించుకోలేదు. ఈ వీఆర్‌ఓనే తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి పట్టాలను జారీ చేసినట్లు సమచారం. ఇదే సర్వే నంబర్‌లో ఫైల్ నెం: బి/820/ 2000 న ఒకరికి ఎకరం 31 గుంటల భూమిని పట్టా చేశారు. వాస్తవానికి పట్టా జారీ చేసిన నెలలో అసైన్డ్ కమిటీ సమావేశం జరగలేదు. దీనిపై ఫిర్యాదు రావడంలో అప్పటి సూర్యాపేట ఆర్డీఓ ప్రొసీడింగ్ నంబర్ డి1/1118/ 20174 తేది 16/0/2015న ఈ పట్టాను రద్దు చేసి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలిచారు. ఇది జరిగి 10 సంవత్సరాలు అవుతున్నా నేటికి ఆ భూమిని స్వాధీనం చేసుకోలేదు.

ప్రభుత్వ భూమిని దాచిపెట్టారు!

కోదాడ సమీపంలోని జాతీయ రహదారిను ఆనుకొని ఈ భూమి ఉండడంతో దీని విలువ రూ.కోట్లలో పలుకుతోంది. కోదాడ 100 పడకల ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి, నూతన బస్టాండ్ నిర్మాణానికి స్థలం కోసం అధికారులు వెతుకుతున్నారు. కానీ తమ కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే రూ.కోట్ల విలువైన ప్రభుత్వభూమి ఉన్న విషయాన్ని దాచిపెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం దాదాపు 24 ఎకరాల భూమి ఇక్కడ ఉండాలి. ఇక్కడ ప్రస్తుతం ఎకరం మార్కెట్ విలువ రూ.2 కోట్ల పైమాటే. అంటే రూ.50 కోట్ల విలువైన ఈ ప్రభుత్వ భూమి విషయంలో ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

కాపర్ వైరు చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ సిబ్బంది

మోటకొండూర్: వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన మల్గ గౌరయ్య, శ్రీశైలం వ్యవసాయ పొలం వద్ద 20వ తేదిన నీళ్లు పెట్టగా కరెంట్ రాలేదు. తరువాత రోజు బోరు మోటార్ మీటర్‌లో సమస్య అనుకుని విప్పి చూశారు. మెకానిక్ కోసం మరుసటి రోజు చూడగా కరెంట్ రావటం లేదని గమనించారు. బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చూడగా అందులోని కాపర్ వైరు చోరీకి గురైంది. ఈ మేరకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


నాగయ్య (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం మృతిచెందాడు. మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గ్రామానికి చెందిన నాగయ్య గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, సరస్వతీదేవి దేవాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తూనే ప్రెస్ ఫొటోగ్రాఫర్‌గా చేస్తున్నాడు. గత వారం కోదాడ- జడ్చర్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో నాగయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై కేసు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఇంట్లో పిల్లలతో సహా నిద్రిస్తున్న మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఇస్తాలపురం గ్రామానికి చెందిన మహిళ భర్త లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 21న అతను డ్యూటీకి వెళ్లాడు. మహిళ తన ఇద్దరు చిన్నపిల్లలతో ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి ఎవరో తలుపు తట్టడంతో తలుపు తీసింది. అదే గ్రామానికి చెందిన ఇరుగు హరీష్ అనే వ్యక్తి ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డాడు. దీంతో మహిళ కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో హరీష్ తప్పించుకున్నాడు. ఈ విషయాన్ని ఆమె తన భర్తకు చెప్పడంతో 22న గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా హరీష్ మహిళ భర్తపై దాడి చేశాడు. దీంతో బుధవారం మహిళ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. హరీష్‌పై అత్యాచార యత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రత్నావత్ శంకర్ నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పంతంగి గ్రామానికి చెందిన కడగంచి వెంకటయ్య చౌటుప్పల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహానికి హాజరై పిలాయిపల్లి కాలువ మీదుగా ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. అదేవిధంగా మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామానికి చెందిన మానె రవికుమార్ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో లింగారెడ్డిగూడెం శివారులోని మర్లమైసమ్మ దేవాలయం సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం వీరిని చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఆస్తి కోసమే అన్నను చంపించాడు

- నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- హత్య కేసు వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: అన్నను అడ్డు తొలగించుకుంటే ఆస్తి మొత్తం తనకే వస్తుందని భావించిన తమ్ముడు సుపారీ ఇచ్చి అన్ననే మట్టుబెట్టించాడు. ఈ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 16వ తేదీన మాడుగులపల్లి మండలంలో జరిగిన ఈ హత్య కేసు వివరాలను బుధవారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తన కార్యాలయంలో వెల్లడించారు. మాడుగులపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి నరసింహకు లింగయ్య, కొండయ్య, శ్రీను ముగ్గురు సంతానం. కొద్ది సంవత్సరాల క్రితం అన్నదమ్ములు ముగ్గురు కలిసి ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేసి పెద్దఅన్న లింగయ్య పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ క్రమంలో లింగయ్య అకాల మరణం చెందాడు. అతడు మృతి చెందిన తరువాత చిన్న తమ్ముడు కాకునూరి శ్రీను, తన అన్న కొండయ్యకు తెలియకుండా తన పేరుపై భూమి పట్టా మార్పిడి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కొండయ్య గత కొంత కాలంగా శ్రీనుతో గొడవ పడుతూ గ్రామ పెద్దలు, బంధువుల వద్ద పంచాయితీ పెట్టాడు. దీంతో ఆస్తి మొత్తం తనకే చెందాలనే దురుద్దేశంతో తన అన్న కొండయ్య ను చంపాలని శ్రీను నిర్ణయానికి వచ్చాడు.

ఆటోలో వచ్చి కత్తులతో పొడిచి..

తన అన్నను చంపాలని నిర్ణయించుకున్న శ్రీను నల్లగొండలో నివాసముంటున్న నిడమనూరు మండలం రాజన్నగూడెం గ్రామానికి చెందిన వేముల నాగరాజు, నల్లగొండ మండలం పానగల్ గ్రామానికి చెందిన పందిరి లింగస్వామి, నల్లగొండ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చీరాల సురేష్, మునుగోడు మండలం గూడపూర్ గ్రామానికి చెందిన జిట్టబోయిన వెంకన్నను ఆశ్రయించాడు. మొత్తం రూ.5లక్షలకు సుపారీ మాట్లాడుకుని రూ.50వేలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. కొండయ్య హత్యకు పథకం పన్నిన నిందితులు ముందుగా నారాయణపురం గ్రామానికి వెళ్లి కొండయ్య కదలికలను గమనించారు. ఈ నెల 16న మధ్యాహ్నం సమయంలో ఆటోలో వచ్చి ఇంట్లో ఒంటరిగా ఉన్న కొండయ్యపై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం కొండయ్యను ఆటోలో తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా గమనించిన స్థానికులు చుట్టుముట్టడంతో కొండయ్యను అక్కడే వదిలేసి ఆటోలో పరారయ్యారు. ఎస్పీ ఆదేశాల మేరకు మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు మాడుగులపల్లి ఎస్‌ఐ క్రిష్ణయ్య తమ సిబ్బందితో దర్యాప్తు చేసిన అనంతరం నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి ఆటోతో పాటు కత్తి, ఖాళీ మద్యం బాటిల్, ఐదు సెల్‌ఫోన్లు, రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రిమాండ్ అనంతరం నిందుతులను పోలీస్ కస్టడీకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ చేయనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ క్రిష్ణయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడిన రేషన్ బియ్యం

మిర్యాలగూడ అర్బన్: త్రిపురారం మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన పాతులోజు బాలు తన బైక్‌పై క్వింటా రేషన్ బియ్యాన్ని బుధవారం బంగారుగడ్డ నుంచి తీసుకెళ్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చైతన్య నగర్‌లోని ఓ గదిలో బియ్యం నిల్వ ఉంచినట్లు, అక్కడి నుంచి మొత్తం బియ్యాన్ని వెంకటాద్రిపాలెంలోని నరేందర్‌కు విక్రయిస్తున్నట్లు చెప్పాడని తెలిసింది. ఈమేరకు చైతన్యనగర్‌కు వెళ్లి పరిశీలించగా మొత్తం 76 బస్తాల బియ్యం (37 క్వింటాళ్లు) అక్రమంగా నిల్వ ఉంచారు. ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గోదాంకు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

వాహనాలు తనిఖీ చేస్తుండగా..

కోదాడరూరల్ : అక్రమంగా తరలిస్తున్న మూడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన జమ్ముల సురేష్ రేషన్ కార్డుదారుల వద్ద తక్కువ రేటుకు బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో దోరకుంట వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో మూడున్నర క్వింటాళ్ల బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండడంతో పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆటోను సీజ్ చేసి సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శోభనాద్రిగూడెంలో మూడు క్వింటాళ్లు..

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలోని శోభనాద్రిగూడెం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రేషన్ బియ్యం సేకరిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. దీంతో రేషన్ బియ్యాన్ని సేకరించేవారు రెండు మోటార్ సైకిళ్లు, రేషన్ బియ్యంతోపాటు తూకం వేసే మిషన్‌ని అక్కడే వదిలివేసి పారిపోయారు. పోలీసులు రేషన్ బియ్యం, బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో పారిపోయిన వారు అడ్లూరు శోభనాద్రిగూడేనికి చెందిన వెంకటేశ్వర్లు, ఏకానందం, పుల్లయ్య, చంద్రం, లక్ష్మణ్, కందుకూరి సుధాకర్ అని తెలిసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఆవు, ఎద్దు మృతి


పెద్దఅడిశర్లపల్లి: పిడుగుపాటుకు గురై ఆవు, ఎద్దు మృతి చెందాయి. పీఏపల్లి మండలం పెద్దగట్టు గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాణావత్ చందు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తనకున్న ఆవు, ఎద్దులను వ్యవసాయ బావివద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగు పడడంతో రెండు మూగజీవాలు అక్కడికక్కడే మృతిచెందాయి. బుధవారం చందు వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా విషయం వెలుగులోకి వచ్చింది. మృతిచెందిన ఆవు, ఎద్దుల విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత


సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్సై

భువనగిరి క్రైం: భువనగిరికి చెందిన మీసాల నవీన్, అరుణ్ సింగ్‌లు గత ఆగస్టు 5న స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్నారు. దీంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఫోన్ల ఆచూకీ తెలుసుకుని బుధవారం బాధితులకు అందజేశారు. ఫోన్ల ఆచూకీ కోసం కృషి చేసిన కానిస్టేబుల్ చెన్నకేశవులును రూరల్ ఎస్సై సంతోష్ కుమార్ అభినందించారు.

సాగర్‌కు తగ్గిన వరద


మూసి ఉన్న సాగర్ క్రస్ట్‌గేట్లు

నాగార్జునసాగర్: ఎగువ నుంచి సాగర్ జలాశయానికి వచ్చే వరద తగ్గడంతో క్రస్ట్‌గేట్లను మూసివేశారు. శ్రీశైలం జలాశయం నుంచి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా విడుదలవుతున్న వరద సాగర్‌కు 48,569 క్యూసెక్కులు వచ్చి చేరగా.. అంతే నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00అడుగులు, 312.0450టీఎంసీలకు ప్రస్తుతం 589.50 అడుగులు, 310.5510 టీఎంసీలు ఉంది. ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 29,476 క్యూసెక్కుల వరద నీరు కృష్ణానదిలోకి విడుదల చేస్తుండగా, కుడి, ఎడమ, వరద, ఏఎమ్మార్పీ కాల్వలకు 19,093 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వచ్చింది 78 టీఎంసీలు.. విడుదల చేసింది 80 టీఎంసీలు

ఈ నెల 16వ తేదీ నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వరద రాక మొదలైంది. రోజుకు లక్ష క్యూసెక్కుల నుంచి రెండున్నర లక్షల క్యూసెక్కుల మేర వరద వచ్చింది. దీంతో 8 రేడియల్ క్రస్ట్‌గేట్లు మొదలుకుని వచ్చే వరదను బట్టి 20రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి నీటిని విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీ రాత్రి వరకు మొత్తం 78 టీఎంసీల నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ వారంలో 80టీఎంసీల నీటిని వదిలినట్లు ఎన్‌ఎస్పీ అధికారులు వెల్లడించారు.

బెల్టు షాప్ యజమాని బైండోవర్

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ఆత్మకూర్(ఎస్) మండలంలోని గట్టికల్లులో మద్యం అమ్మకం నిషేధం అమలవుతుండగా.. గ్రామానికి చెందిన యాదగిరి సోమవారం మద్యం విక్రయిస్తుండగా గ్రామస్తులు గమనించారు. మద్యం అమ్మకం నిషేధం అమల్లో ఉన్నా మద్యం విక్రయించినందుకుగాను బుధవారం అతని ఇంటి ఎదుట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు యాదగిరిని అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శంకర్ నాయక్ తెలిపారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో దిగుబడులు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి

మోతె: అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులు దిగుబడులు సాధించవచ్చని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ కోయంబత్తూర్ ప్రిన్సిపాల్, సైంటిస్టు డాక్టర్ ఎస్.ఉషారాణి తెలిపారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ నాగపూర్ సహకారంతో బుధవారం మోతె మండలం రావిపహాడ్‌లోని రైతు వేదికలో రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం-గడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగులో కూలీల సమస్య తగ్గించేందుకు యాంత్రిక విధానాలు అమలు చేయాలన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు అయ్యే ఖర్చుకుగాను రైతులకు జాతీయ ఆహార మిషన్ నుంచి ఎకరాకు రూ.6 వేలు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. అనంతరం పత్తి సాగుపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పత్తి తీతలో మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సేద్యపు విభాగపు శాస్త్రవేత్త డి.నరేష్, మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్, ఏఓ అరుణ, యంగ్ ప్రొఫెషనల్ జి.సంతోష్, గ్రామ రైతులు మల్లారావు, వెంకన్న, ఉప్పలయ్య, గంగయ్య, సుధాకర్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటయ్య

మునుగోడు: అక్రమ సంపాదనకు అలవాటుపడి ఓ యువకుడిని వేధింపులకు గురిచేసి అతడి ఆత్మహత్యకు కారకుడైయినా వ్యక్తిని మునుగోడు పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చండూరు సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు పట్టణానికి చెందిన పందుల రవితేజ హోటల్ కొనసాగిస్తూ ఓ సంఘం పేరుతో పలువురిని బెదిరింపులకు గురిచేస్తూ అక్రమంగా వసూలు చేయడం అలవాటు చేసుకున్నాడు. అదే తరహాలో మునుగోడులోని చండూరు రోడ్డులోని ప్రభుత్వ భూమిలో నూతనంగా ఇంటి నిర్మాణం చేసుకున్న మునుగోడుకు చెందిన యరసాని వీరయ్యను తనకు డబ్బులు ఇవ్వకుంటే నీ ఇంటిని కూల్చివేయిస్తానని బెదిరించాడు. అయినా అతను డబ్బులు ఇవ్వకపోవడంతో మరో ఇద్దరు, ముగ్గురితో కలిసి లోకాయుక్తలో కేసు వేశాడు. దీంతో అధికారులు కేసువేసిన వ్యక్తులతో రాజీ పడకుంటే ఇల్లు కూల్చివేస్తామని తేల్చి చెప్పడంతో ఆందోళనకు గురైన వీరయ్య ఈ విషయాన్ని తన కుమారులకు తెలిపాడు. దీంతో అప్పు చేసి మరీ కట్టుకున్న ఇంటిని కూల్చేందుకు రవితేజ ప్రయత్నిస్తున్నాడని ఆందోళన చెందిన వీరయ్య పెద్ద కుమారుడు శివ 15వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవితేజ వేధింపుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి రవితేజను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ సైదులు, స్వర్ణనాయక్, కానిస్టేబుల్ నాగేశ్వరరావు, రమణారెడ్డి, రామనర్సింహ ఉన్నారు.

సాగర్‌లోని బుద్ధవనాన్ని ప్రమోట్ చేయాలి


పాట్నాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

- పాట్నాలో ట్రావెల్ ఏజెంట్లతో సమావేశమైన టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని అలనాటి బౌద్ధ సంస్కృతిని ఈ తరానికి తెలియజేసేందుకు పాట్నాలోని బుద్ధగయను సందర్శించే బౌద్ధపర్యాటకుల్ని బుద్ధవనానికి తీసుకురావాలని తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి కోరారు. అసోసియేషన్ ఆఫ్ బుద్ధిస్ట్ ఆపరేటర్స్ (ఏబీటీఓ) సహకారంతో బుధవారం పాట్నాలోని ఆనంద్ ఇంటర్నేషనల్ హోటల్‌లో ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పర్యాటకం మునుపెన్నడు లేనంతగా ఊపందుకుందన్నారు. ,బుద్ధిస్ట్ సర్క్యూట్‌తో పాటు బౌద్ధపర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బుద్ధవనం బుద్ధి ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వీడియోను ప్రదర్శించి, ప్రత్యేకతలను వివరించారు. ఏబీటీఓ జనరల్ సెక్రెటరీ, హంస హాలిడేస్ అధినేత కౌలేష్‌కుమార్ మాట్లాడుతూ.. బౌద్ధగయ, బుద్ధవనానికి మధ్య పర్యాటక అనుసంధానాన్ని ఏర్పాటు చేసి బుద్ధగయలో బుద్ధవనం గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం మహాబోధి దేవాలయ నిర్వహణ కమిటీ రమేష్‌రెడ్డికి బుద్ధగయ దేవాలయ పుస్తకాన్ని, బుద్ధుడి ప్రతిమను బహూకరించారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి


మాట్లాడుతున్న నిర్మలా జగ్గారెడ్డి

బీబీనగర్ : స్థానిక యువతకు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా పారిశ్రామికవేత్తలు చొరవ చూపాలని టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. బీబీనగర్ మండలం రాయరావుపేటలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో బుధవారం ఇండస్ట్రీస్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నైపుణ్య అభివృద్ధిని ప్రోత్సహిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తలు వ్యక్తి చదువునే ప్రామాణికంగా తీసుకోకుండా అతనిలోని నైపుణ్యం కూడా చూసి ఉద్యోగ, ఉపాధి వకాశాలు కల్పించాలని కోరారు. చిన్న తరహా పరిశ్రమలు ఎక్కువ లాభాలు తెచ్చిపెడుతాయని, నాణ్యత కలిగిన ముడి సరుకులు తయారు చేయాలని సూచించారు. ఇండస్ట్రియల్ పార్కులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహాగౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కోశాధికారి నాగచారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీఐఎఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు, మాజీ సర్పంచ్ సంతోషరమేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో పూజలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూప్రసాదం అందజేశారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం

- బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ సూర్యప్రకాష్


మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాష్

చౌటుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని, అందులో భాగంగానే ఆదాని గ్రూప్‌కు చెందిన అంబుజా సిమెంట్ పరిశ్రమను రామన్నపేటకు తీసుకువస్తున్నారని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ ఆరోపించారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పచ్చని పంటలతో కళకళలాడే పల్లెసీమలపై కాలుష్య రక్కసిని తేవడం దుర్మార్గమన్నారు. రానున్న రోజుల్లో ప్రజల జీవనం కష్టంగా మారుతుందన్నారు. అన్ని రకాల కులవృత్తులు నిలిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో ఉన్న సిమెంట్ పరిశ్రమలతో అక్కడి ప్రజలు సగం వయస్సుకే తనువులు చాలిస్తున్నారన్నారు. సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నూనె వెంకటస్వామిని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కంపెనీకి సానుకూలంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేషంల కుట్రతోనే అరెస్ట్ జరిగిందని విమర్శించారు. పరిశ్రమ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజా పోరాట సమితి యాదాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల్ గోపాల్, వివిధ సంఘాల నాయకులు మారోజు సునీల్‌కుమార్, బొడ్డు శంకర్, యాదయ్య, మారగోని శ్రీనివాస్, గ్యార మారయ్య పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎంజీయూ వీసీ


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంజీయూ వీసీ

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి యూనివర్సిటీ ప్రగతిని ఆయనకు వివరించారు.

యూనివర్సిటీలో బయోమెట్రిక్ అమలు

నల్లగొండ రూరల్: మహాత్మా గాంధీ యూనివర్సిటీలో బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాల మేరకు ఎంజీయూ రిజిస్ట్రార్ రవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు యూనివర్సిటీలో ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారికి బయో మెట్రిక్ హాజరు ప్రకారమే వేతనాల చెల్లింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు కూడా బయో మెట్రిక్ తప్పనిసరిగా వేయాలని పేర్కొన్నారు. గతంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు పని గంటలు ఉండగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీసీ సమయ పాలన మార్చారు.

వరిలో ఎలుకల నివారణ చర్యలు

- నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సూచనలు



నడిగూడెం: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగులో ఉన్న వరి పంటను ఎలుకలు తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఎలుకలపై రైతులు నిఘా ఉంచాలని, గట్ల సంఖ్యను, పరిమాణాన్ని వీలైనంత వరకు తగ్గించడం ద్వారా ఎలుకల నివాస స్థావరాలను తగ్గించవచ్చని నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాయపు దేవ ప్రసాద్ అంటున్నారు. ఎలుకల నివారణకు ఆయన సలహాలు, సూచనలు ఇవీ..

పొలం గట్లపై గడ్డి, కలుపు లేకుండా శుభ్రపరుచుకోవాలి. గట్లను పదునైన పారతో చెక్కుకోవాలి. ఎలుకల బుట్టలను నారుమడి పోసిన దగ్గర నుంచి దమ్ములు పూర్తయిన తర్వాత నాట్లు వేసిన ఒక నెల వరకు మరియు కోతల తర్వాత ఎకరానికి 20 చొప్పున పెట్టినచో వలస వచ్చే, పోయే ఎలుకలను సమర్థవంతంగా నివారించవచ్చు. పంట లేని సమయంలో ఎలుకల నివారణ చేపడితే వాటి సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చు. ఆ సమయంలో ఎలుకలకు కావాల్సిన ఆహారం తక్కువగా దొరకడంతో ఎరను తినడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. పంట కాలంలో విషపు ఎరలను చిరుపొట్ట దశ ఏర్పడకముందే ఉపయోగించాలి.

బ్రోమడయోలోన్ : బ్రోమడయోలోన్ ఎరను వాడేటప్పుడు విషం కలుపని ఎర ద్వారా ఎలుకలను మచ్చిక చేయనవసరం లేదు. ఈ ఎరను 10–15 గ్రాముల (96 శాతం నూకలు, 2 శాతం నూనె, 1 శాతం మందు) పొట్లాలుగా కట్టి కన్నంలో ఒకటి చొప్పున పెట్టాలి. సజీవ ఎలుక బొరియలలో పది రోజుల వ్యవధితో పైరు చిరుపొట్ట దశకు వచ్చే వరకు రెండుమూడు సార్లు వాడవచ్చు.



ఎర స్థావరాలు : బ్రోమడయోలోన్ ఎరను సరైన స్థావరాలను ఏర్పాటు చేసుకుని వాడకం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చు. ఎకరానికి 5-6 పీవీసీ పైపు ఎర స్థావరాలను (3 అంగుళాల వ్యాసం, 1.5 అడుగు పొడవు) పొలానికి నాలుగు మూలల గట్లపై అమర్చుకోవాలి. వీటిలో బ్రోమడయోలోన్ ఎర మందు 30 గ్రాముల చొప్పున వేసి, వారానికి రెండు సార్లు తయారుచేసిన ఎర మందును మార్చుకోవాలి. ఈ పద్ధతిని వరి నాట్లు వేసిన దగ్గర నుంచి చిరుపొట్ట దశ వరకు అవలంబించాలి. ఇటువంటి ఎర స్థావరాల్లో ఉంచిన విషపు ఎర ఎండ, వానలకు పాడవ్వకుండా ఉండడమే కాకుండా పెంపుడు జంతువులకు, పక్షులకు అందుబాటులో ఉండదు కావున వాటికి ఏవిధమైన హాని జరగదు. ఈ ఎర స్థావరాలను అమర్చి ముందుగా విత్తిన వరి నారుమళ్లను కూడా ఎలుకల బారి నుంచి సమర్థవంతంగా కాపాడుకోవచ్చు.

జింకుఫాస్ఫైట్ ఎర : ఎలుకల ఉధృతి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు పంట కాలంలో ఒక్కసారి మాత్రమే జింకు ఫాస్ఫైట్ ఎరను వాడాలి. దీనికి ముందుగా విషంలేని ఎరను 20 గ్రాములు (98 శాతం నూకలు, 2 శాతం నూనె) పొట్లాలుగా కట్టి కన్నానికి ఒకటి చొప్పున పెట్టి రెండు రోజుల ఎలుకలను మచ్చిక చేసుకోవాలి. మూడవ రోజు జింకు ఫాస్ఫైడ్ ఎరను 10 గ్రాములు (96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం మందు) పొట్లాలు కట్టి కన్నంలో ఒకటి చొప్పున వేయాలి.

బ్రోఫ్యూమిగేటర్ (పొగబారించే యంత్రం)

పంట ఏ దశలోనైనా ఎలుకల కన్నాలలో పొగను బ్రోఫ్యూమిగేటర్ ద్వారా వదిలి సులువుగా చంపవచ్చు. పొగను వదిలేటప్పుడు కన్నం చుట్టూ ఉన్న పగుళ్లను మట్టితో మూసివేసి, పొగను కనీసం మూడు నిమిషాలు వదలాలి. ఎలుకలు రసాయనిక ఎరలను స్వీకరించని సమయాల్లో కూడా దీని ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. పంట ఈనిన దశలో పొగబారించడం ద్వారా ఒకే కన్నంలో వివిధ దశలలో ఉన్న ఎలుకలను, చూడు ఎలుకలను నిర్మూలించి తదుపరి సీజన్‌లో వాటి ఉధృతిని తగ్గించవచ్చు.